JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । శుక్రవారం 05-06-2026
Medchal - Malkajgiri । Friday 05-06-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 04
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 04 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




2 లో

## ఘోర అగ్ని ప్రమాదం

- భారీగా ట్రాఫిక్ జామ్
- అమీర్‌పేటలో షాపింగ్ కాంప్లెక్స్‌కు మంటలు
- 20కిపైగా దుకాణాలు దగ్ధం
- ఫైర్ సిబ్బందితో కలసి మంటలనార్పిన హైడ్రా డీఆర్ ఎఫ్ బృందాలు

- జయభేరి, హైదరాబాద్, జూన్ 4 :

హైదరాబాద్ సిటీ నడిబొడ్డు అమీర్‌పేటలో మెయిన్ రోడ్డులో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మైత్రీవనం సమీపంలో మెయిన్ రోడ్డుపైనే ఉన్న ఓ బొమ్మల దుకాణంలో మంటలు చెలరేగాయి. అవి ఆర్పే లోపు మొత్తం ఆ బిల్డింగ్‌లో ఉన్న అని దుకాణాలకు వ్యాపించాయి. చుట్టుపక్కల షాపులు అన్నీ అగ్నికి ఆహుతైపోయాయి. భారీగా ఎగసిపడుతున్న మంటలు కమ్ముకున్న పొగతో ఆ ప్రాంతంలో గందరగోళం నెలకొంది. బొమ్మల దుకాణంలో చెలరేగిన మంటలు పక్కనే ఉన్న KSR ఫ్యాషన్స్ అనే బట్టల దుకాణానికి అంటుకోవడంతోనే మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. మొత్తం బిల్డింగ్ మంటలు వ్యాపించాయి. బిల్డింగ్ మొత్తం నిలువెల్లా తగలబడిపోయింది. భగభగమండే మంటలతో దగ్గరకు వెళ్లటానికి సైతం అగ్నిమాప సిబ్బంది భయపడిపోయారు. బిల్డింగ్ మొత్తం మంటల్లో కాలిపోతున్న విజువల్స్ చుట్టు పక్కల వాళ్లను భయాందోళనలకు గురి చేశాయి. మూడు అంతస్తుల ఈ బిల్డింగ్ మొత్తం కాలిబూడిద అయ్యింది. ఈ బిల్డింగ్ చుట్టూ హోటళ్లు, రెస్టారెంట్లు, కంప్యూటర్ షాపులు, సెల్ ఫోన్ షాపులు ఇలా చాలా షాపులు ఉన్నాయి. వీటిలో 20కిపైగా షాపులు కాలిబూడిదైనట్టు తెలుస్తోంది.



2 లో

## బాలికపై గ్యాంగ్ రేప్

- పవిత్ర క్షేత్రంలో ఇలాంటి నేరాలు జరగడం తీవ్ర కలకలం
- ప్రభుత్వం అలర్ట్ - సీఎం విజయ్ కఠిన ఆదేశాలు
- మహిళల రక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తూ.. గిరి ప్రదక్షిణ మార్గమంతటా అదనపు పోలీసు బలగాలతో అవుట్ పోస్టులను, నిరంతర పెట్రోలింగ్‌ను ఏర్పాటు

- జయభేరి, హైదరాబాద్, జూన్ 4 :

అరుణాచల గిరి ప్రదక్షిణ బాటలో కేవలం ఒక రోజు వ్యవధిలోనే ఇద్దరు యువతులపై ఒకే దండగుల ముఠా అత్యంత అమానుషంగా సామూహిక అత్యాచారానికి పాల్పడింది. మే 30న ఒక వివాహితపై, ఆ మరుసటి రోజు మే 31న మరో 23 ఏళ్ల యువతిపై మారణాయుధాలతో దాడి చేసి, సమీపంలోని అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లి ఈ ఘాతుకానికి ఒడిగట్టారు. అంతటితో ఆగకుండా బాధితులను నగ్నంగా వీడియోలు తీసి, డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేయడం, నగలు దోచుకోవడం వంటి దారుణాలు భక్తుల భద్రత ఏ స్థాయిలో ఉందో అద్దం పడుతోంది. పోలీసులు ఈ కేసులో ఇప్పటివరకు 8 మందిని అరెస్ట్ చేసినప్పటికీ, పవిత్ర క్షేత్రంలో ఇలాంటి నేరాలు జరగడం తీవ్ర కలకలం రేపుతోంది. గడిచిన కొన్నేళ్లుగా అరుణాచలానికి వచ్చే భక్తుల సంఖ్య లక్షల కు చేరింది. ముఖ్యంగా ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షిణ చేసేందుకు భక్తులు పోటెత్తుతున్నారు.

### పాలమూరు మూల మూలనా...
### కృష్ణమ్మ నీళ్లు పరవళ్లు తొక్కాలి...
### పచ్చని పంట పొలాన రైతన్న మురవాలి...

# ఇది నా సంకల్పం



*మక్తల్ – నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం (MNKLIS) పనుల పురోగతి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్, ప్లాన్ మ్యాప్‌స్‌ను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతంగా జరగాలని పలు సూచనలు చేశారు.*

- నారాయణపేట ముఖ్యమంత్రి పర్యటన

జయభేరి, నారాయణపేట :

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టుల పనులను పరిశీలించడానికి బెంగుళూరు నుంచి నేరుగా నారాయణపేట జిల్లా మక్తల్ చేరుకున్న ముఖ్యమంత్రి మొదటగా మక్తల్ - నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంపై జరుగుతున్న పనులను వివరించే ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం కోయిల్ సాగర్ ప్రాజెక్టు, భీమా, కృష్ణా నదులపై ప్రతిపాదిత బ్యారేజీల నిర్మాణం, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు డ్యామ్ సైట్‌ను ఏరియల్ సర్వే చేశారు. అక్కడి నుంచి జోగులాంబ గద్వాల జిల్లా ధారూర్ మండలం గూడెందొడ్డి చేరుకున్న ముఖ్యమంత్రి నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం స్టేజీ 1 పంప్ హౌజ్ పనులను పరిశీలించారు. మక్తల్ మండలం కాట్రేవుపల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న ఎత్తిపోతల ప్రాజెక్టు ప్యాకేజీ 1 సైట్ వద్దకు చేరుకుని అక్కడ పనులను పరిశీలించారు. ప్యాకేజీ 1 లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత మేరకు పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. తో పాటు కర్నాటక మాజీ మంత్రి ఎన్ఎస్ బోసెరాజు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు.

## జూన్ 4 మరిచిపోలేని రోజు

- ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు
- ఏపీకి మంచి రోజులు వచ్చాయి



జయభేరి, విజయవాడ జూన్ 4 :

ఏపీ రాజకీయాల్లో సంచలన విజయాన్ని నమోదు చేసి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి పునాది పడిన రోజును గుర్తుచేసుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగ పోస్ట్ పెట్టారు. 2024 జూన్ 4వ తేదీ (ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు) ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో ఐదేళ్లుగా సాగిన విధ్వంసకాండకు పూర్తిగా స్వస్తి పలికి.. రాష్ట్రాన్ని మళ్లీ వికాసం వైపు, ప్రగతి వైపు నడిపించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎంతో స్పష్టమైన తీర్పునిచ్చిన రోజు ఇదని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు ఒక కీలక సందేశాన్ని ఇచ్చారు. ప్రజలు తమకు అప్పగించింది కేవలం 'అధికారాన్ని' కాదని.. కోలుకోలేని స్థితికి చేరిన రాష్ట్రాన్ని మళ్లీ పునర్నిర్మించే ఒక 'గొప్ప బాధ్యతను' తమ భుజాలపై పెట్టారని ఆయన వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం ప్రతిక్షణం ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకే పనిచేస్తుందని సీఎం స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన

...మిగతాది 2 లో



## ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యం

- రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు
- కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- ఇప్పటికే నాలుగు ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన
- రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదు
- సందేహాల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 4788, వాట్స్ యాప్ 8247619983
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ

జయభేరి, హైదరాబాద్, జూన్ 4 :

తెలంగాణ ప్రజలకు వేగవంతంగా పారదర్శకంగా అత్యుత్తమ సేవలు అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గచ్చిబౌలిలోని తాలిమ్ లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్టర్ కార్యాలయ నిర్మాణ పనులను గురువారం

...మిగతాది 2 లో



## ప్రభుత్వ సెక్యూరిటీలపై క్యాపిటల్ గెయిన్స్ టాక్స్ రద్దు

- విదేశీ పెట్టుబడుల కోసం యత్నాలు
- రాష్టపతి ఆమోదం లభించిన వెంటనే ఈ కొత్త నిబంధన అమల్లోకి

జయభేరి, న్యూఢిల్లీ, జూన్ 4 :

ఇరాన్ యుద్ధం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉంది. ఈ ప్రతికూల ప్రభావాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ కీలక అడుగు వేసినట్లు తెలుస్తోంది. దేశంలోకి విదేశీ పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆకర్షించడమే లక్ష్యంగా సంచలన నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఆర్డినెన్స్‌ను ఆమోదించినట్లు సమాచారం. ఈ ఆర్డినెన్స్ ద్వారా ఆదాయపు పన్ను

...మిగతాది 2 లో



## జూన్ 10న తిరుగులేని లీడర్‌గా నయా హిస్టరీ

- నెహ్రూ దశాబ్దాల రికార్డును బద్దలు కొట్టనున్న ప్రధాని మోదీ

జయభేరి, న్యూఢిల్లీ, జూన్ 4 :

భారత రాజకీయ చరిత్రలో జూన్ 10 సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా నిలవనుంది. దేశాన్ని అత్యంత సుదీర్ఘకాలం, ఎలాంటి విరామం లేకుండా పరిపాలించిన ప్రధానిగా నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించబోతున్నారు. ఇప్పటివరకు స్వతంత్ర భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న దశాబ్దాల రికార్డును ప్రధాని మోదీ బద్దలగొట్టనున్నారు. దేశంలో మొదటి సాధారణ ఎన్నికలు 1951-52లో జరిగాయి. ఆ ఎన్నికల అనంతరం తొలిసారిగా

...మిగతాది 2 లో

# వర్షాకాలం దృష్ట్యా పారిశుద్ధ్యంపైన ప్రత్యేక చర్యలు

- యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీ-భరత్‌గౌడ్

జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 04 :



రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పారిశుద్ధ్యంపైన ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ముగింపులో భాగంగా గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని 1,2,3 వార్డులలో వార్డు సభ నిర్వహించారు.
ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా మున్సిపల్ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రైనేజీలలో చెత్త నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. చెత్త బండ్లలో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి వేయాలని ప్రజలను కోరారు. యాదగిరిగుట్ట పట్టణంలోని మంచి నీటి సమస్యలు పరిష్కరిస్తున్నామని, రోడ్లు, డ్రైనేజీ పనులను త్వరలో పూర్తి చేసి అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బరిగే రమ్య రామచందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు బోడ రాధసురేష్, బూడిద మధు, కాటబత్తిని స్వప్నఆంజనేయులు, బిట్లు సరోజ హరీష్, కర్రె మాధవి ప్రవీణ్, పెలిమెల్లి లావణ్యశ్రీధర్, పెరబోయిన సత్యనారాయణ, బబ్బూరి శ్రీధర్, సాదునేని ధనలక్ష్మి మధుకర్, ముక్కెర్ల మల్లేష్, కోఆప్షన్ సభ్యులు గౌలీకార్ అరుణ రాజేష్, బండి జంగమ్మ, రహీమ సలాంతో పాటు పోలీస్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యాదగిరిగుట్ట మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. తొలి రోజు చొల్లేరు, మర్రిగూడెం, మహబూబ్‌పేట, రామాజీపేట, తాళ్ల గూడెం, చిన్నకందుకూరు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చించారు. గ్రామాల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూడాలని సర్పంచ్‌లు అధికారులకు సూచించారు. అనంతరం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అధికారులు వివరించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా తమకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులు, ప్రజలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## యాదగిరీశుడి హుండీ ఆదాయం రూ.3.18 కోట్లు

జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 04 :

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి హుండీ ఆదాయం రూ.3,18,37,261 వచ్చినట్లు యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు. గురువారం కొండ కింద గల వ్రత మండపంలో 30 రోజుల హుండీ ఆదాయం లెక్కింపు జరిగింది. నగదుతో పాటు 179 గ్రాముల బంగారం, మూడు కిలోల వెండిని భక్తులు హుండీలో సమర్పించుకున్నట్లు తెలిపారు. అమెరికా 502 డాలర్లు, ఇంగ్లాండ్ 5 పౌండ్లు, కెనడా 130 డాలర్లు, నేపాల్ 100, ఆస్ట్రేలియా 75, ఖతార్ ఒక రియాల్, మలేషియా 1, సౌదీ అరేబియా 5, వియత్నాం 10,000, ఫిలిపిన్స్ 60, ఎతోఫియా 10, యూరప్ 10ని భక్తులు హుండీలో సమర్పించినట్లు ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు.

## ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి



జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 04 :

విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కళ్లెం కృష్ణ డిమాండ్ చేశారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ యాదగిరిగుట్ట తహశీల్దార్ గణేష్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో అనేక కాలేజీలు మూతపడ్డాయని, మరికొన్ని మూతపడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు రాకపోవడంతో కాలేజీలు విద్యార్థులకు మెమోలు, టీసీలు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, విద్యార్థులకు ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్, గీతా పనివారుల సంఘం జిల్లా సభ్యులు బబ్బూరి శ్రీధర్, బీసీ హక్కుల సాధన సమితి మండలాధ్యక్షులు పాకాలపాటి రాజు, నేతలు పబ్బాల స్వామి, గుండు వెంకటేష్, కంసాని రాము, అనంతుల నరసింహ, కంబాల జహంగీర్, బొమ్మిడి నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి జిల్లా ప్రశిక్షణా తరగతుల నిర్వహణ

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లాలో ఈనెల 5, 6 తేదీలలో బిజెపి జిల్లా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు బిజెపి నాయకులు తెలిపారు. మొదటిరోజు ఉదయం 9 గంటలకు శిబిరా స్థలానికి ప్రతి ఒక్కరు హాజరుకావాలని బిజెపి నాయకులు సూచించారు. అలాగే మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమాన్ని ముగుస్తున్నట్లు వారు పేర్కొన్నారు. స్థానిక బండమీదిపల్లిలోనున్న రెడ్డి కన్వెన్షన్ హాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణ మహా అభియాన్ 2026 పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు పి.శ్రీనివాస్ రెడ్డి, నేతృత్వంలో జరగబోయే ఈ ప్రశిక్షణ తరగతులకు ముఖ్య అతిథులుగా పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డికె అరుణమ్మ, పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గం బిజెపి పార్టీ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. ఈ కార్యక్రమానికి బిజెపి పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మండల ప్రభారి, జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల పదాధికారులు, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర, జిల్లా సెల్ కన్వీనర్లు, రాష్ట్ర మోర్చా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా స్థాయిలో వివిధ బాధ్యతలు ఉన్నవారు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కార్పొరేటర్, కౌన్సిలర్లు, సర్పంచులుగా ఎన్నికైన ప్రతినిధులు, జిల్లాకు చెందిన జాతీయ, రాష్ట్ర పదాధికారులు, కార్యవర్గ సభ్యులు, జాతీయ రాష్ట్ర స్థాయిలో వివిధ బాధ్యతలతో ఉన్న నాయకులు, వివిధ పార్టీల నుండి బిజెపిలో చేరిన జిల్లా స్థాయి నాయకులు, జిల్లా కమిటీ సూచించిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఇతర ప్రత్యేక ఆహ్వానితులు అందరూ సకాలంలో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని బిజెపి పార్టీ నాయకులు కోరారు.


## రాపిడో డ్రైవర్ సమయస్ఫూర్తి, దుండిగల్ పోలీసుల మెరుపు దాడి డ్రగ్స్ నెట్‌వర్క్ గుట్టు రట్టు

జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్ నుండి గండి మైసమ్మకు ఒక వ్యక్తి రాపిడో పార్సెల్ బుక్ చేయగా... ఆ పార్సిల్‌ను చూసి రాపిడో డ్రైవర్ శ్రీ సత్తు ఆదర్శ్‌కు అనుమానం వచ్చింది. ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా, బాధ్యతగల పౌరుడిగా అతను వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సత్తు ఆదర్శ్ ఇచ్చిన పక్కా సమాచారంతో దుండిగల్ పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో ఒక డ్రగ్ పెడ్లర్ ను, ఒక డ్రగ్ కన్జ్యూమర్ ను, రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పెడ్లర్ వద్ద నుండి 1 కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సత్తు ఆదర్శ్ చూపిన సమయస్ఫూర్తి, సామాజిక బాధ్యతను అభినందిస్తూ... కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి, ఆదర్శ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, నగదు బహుమతిని అందజేశారు.

# స్వామి వారిని దర్శించుకున్న భీమకంటే మఠం పీఠాధిపతి

జయభేరి, యాదగిరిగుట్ట :



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. గురువారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్య నారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### శ్రీనారసింహుడి నిత్యరాబడి..

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా గురువారం రూ.25,32,113 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,38,100, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,49,400, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజల ద్వారా రూ.1,30,000, వీఐపీ దర్శనం ద్వారా రూ.2,95,650, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.3,77,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.72,432, ప్రసాద విక్రయం ద్వారా రూ.10,27,170, కల్యాణకట్ట ద్వారా రూ.86,500తో పాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

### శ్రీవారి సేవలో..

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని కర్ణాటక చెందిన భీమకంటే మఠం పీఠాధిపతి రాఘవేంద్ర తీర్థ స్వామీజీ దర్శించుకున్నారు. గురువారం స్వామి వారి దర్శనార్థం యాదగిరిగుట్టకు వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఆగమైపోతున్న ఆటో డ్రైవర్ల బతుకులు

- మహబూబ్ నగర్ జిల్లా ఆటో జేఏసీ ప్రధాన కార్యదర్శి కె రాము ఆవేదన
- దేవరకద్రలో ఆటో యూనియన్ సమావేశం
- నల్ల బ్యాడ్జీలతో నిరసన

జయభేరి, దేవరకద్ర :



ఎంతో కష్టపడి తెచ్చుకున్న తెలంగాణలో ఆటో డ్రైవర్ల బతుకులు ఆగమైపోతున్నాయని మహబూబ్ నగర్ జిల్లా ఆటో జేఏసీ ప్రధాన కార్యదర్శి కే.రాము ఆవేదన వ్యక్తపరిచారు. దేవరకద్రలో గురువారం దేవరకద్ర నియోజకవర్గం ఆటో యూనియన్ ఏరియా సమావేశాన్ని నిర్వహించారు. దేవరకద్ర నియోజకవర్గ ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆదేశాల మేరకు జరిగిన ఈ సమావేశంలో పాలమూరు జిల్లా ఆటో జేఏసీ ప్రధాన కార్యదర్శి కే.రాము ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఒకపక్క తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు జరుపుకుంటుంటే, మరోపక్క ఆటో డ్రైవర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి పరిస్థితులు దాపరిచాయన్నారు. అంటే తెచ్చుకున్న తెలంగాణలో ఆటోల బతుకులు ఆగమైపోయాయని చెప్పడానికి ఇది సాక్ష్యం గా నిలుస్తుందన్నారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణంతో ఒక పక్క ఆటో డ్రైవర్లు గిరాకీ పడిపోయి ఆత్మహత్యలు చేసుకుంటుంటే మరోపక్కల పెట్రోల్, డీజిల్ చార్జీలు పెంచి వారి బతుకులను మరింత అఘాతంలోకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెట్టేశాయని ఆయన ఆగ్రహం వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ సభ్యులు పెరిగిన పెట్రోల్, డీజిల్ చార్జీలకు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి కోట్ల రామకృష్ణ, సలహాదారులు చిన్నారెడ్డి, శ్రీనివాసులు, అంజి, రాఘవేందర్, భీమాచారి, బాలకృష్ణ శెట్టి లతోపాటు దాదాపు 15 రూట్ల ఇంచార్జీలు, డ్రైవర్లు మరియు ఓనర్స్ పాల్గొన్నారు.

## క్రీడలను ప్రోత్సహిద్దాం.. మంచి విద్యార్థులను తయారు చేద్దాం

- ఎంపి ఈటల రాజేందర్

జయభేరి, రంగారెడ్డి



మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎల్బీ నగర్ లో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ 2026 ముగింపు ఉత్సవాల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ తో చేసిన గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులతో కలిసి ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకాలంలో పొద్దున్నుంచి రాత్రి దాకా చదువు తప్ప ఇంకోటి లేదు. అదొక్కటే సరిపోదు, సంపూర్ణత్వం ఇవ్వదు. విద్యార్థికి తనకాళ్ళ మీద తను నిలబడేలా విద్య ఉండాలి తప్ప.. మార్కులే పరమావధి కాకూడదు. అన్నిటినీ తట్టుకొని నిలబడే మానసిక స్థైర్యం అందించేవి క్రీడలు. ప్రభుత్వంతో పాటు అనేక మంది క్రీడాభిమానులు కలిసి ఈ క్యాంప్ నిర్వహించారు. కోచింగ్ ఇచ్చిన టీచర్లకు, ఓపికగా తీసుకువచ్చిన తల్లిదండ్రులకు, నిర్వాహకులకు, అధికారులకు నా హృదయపూర్వక అభినందనలు. మనం కనకూడని వినకూడని అనేక రుగ్మతలు వెంటాడుతున్నాయి.. వాటి నుంచి దూరం చేయగలిగిన సత్తా క్రీడలకు ఉంది. క్రీడలను ప్రోత్సహిద్దాం మంచి విద్యార్థులను తయారు చేద్దామని అన్నారు.

## నిరుపయోగం పబ్లిక్ టాయిలెట్స్ కథనంపై స్పందన

- జేసీబీలు నిలుపకుండా ఏర్పాట్లు చేసిన అధికారులు
- త్వరలో అందుబాటులోకి రానున్న పబ్లిక్ టాయిలెట్స్







జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 04 :

జయభేరీ పత్రికలో వచ్చిన నిరుపయోగం పబ్లిక్ టాయిలెట్స్ స్పందన వచ్చింది. యాదగిరిగుట్ట పట్టణంలోని పాత బస్టాండ్ పెద్దమోరీ సమీపంలో నిరుపయోగం పబ్లిక్ టాయిలెట్స్ ఉన్నాయని వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పబ్లిక్ టాయిలెట్స్ ముందు జేసీబీలు ఏర్పాటు చేయడంతో ఎవరికీ కనిపించగా నిర్వాహణా భారంతో దానిని నిర్వాహకులు మూసివేశారు. దీనిపై స్పందించిన జయభేరీ పత్రిక వెంటనే పూర్తి వివరాలతో వార్తను ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు జేసీబీలు నిలుపకుండా పబ్లిక్ టాయిలెట్స్ ముందు అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. జయభేరీలో వచ్చిన కథనం వల్లే పబ్లిక్ టాయిలెట్స్ ముందు జేసీబీలు నిలుపకుండా అధికారులు చర్యలు తీసుకున్నారని నిర్వాహకులు తెలిపారు. త్వరలో పబ్లిక్ టాయిలెట్‌స్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.



## ఆర్డీఓను మర్యాదపూర్వకంగా కలిసిన డా. కొర్ర కిషన్ నాయక్

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ డివిజన్ నూతన రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) గా బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి పద్మప్రియ ని గురువారం ఆర్టీఐ యాక్టివిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొర్ర కిషన్ నాయక్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో భాగంగా దేవరకొండ డివిజన్ పరిధిలోని పలు ప్రజా సమస్యలు, పరిపాలనాంశాలపై చర్చించారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంచేందుకు, నిరుపేదలకు, అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ కొర్ర కిషన్ నాయక్ మాట్లాడుతూ...నూతన ఆర్డీఓ పద్మప్రియ నాయకత్వంలో దేవరకొండ డివిజన్ లోని రెవెన్యూ వ్యవస్థ మరింత బలోపేతం కావాలని, ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం కాగలవని ఆశిస్తున్నాం. సమాచార హక్కు చట్టం కార్యకర్తలకు, ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయడంలో నూతన అధికారిణి చొరవ చూపాలని ఆర్టీఐఏఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా..కొర్ర కిషన్ నాయక్ కోరినారు.

## పర్యావరణ వారోత్సవ కార్యక్రమం



జయభేరి, దేవరకొండ :

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక "పర్యావరణ వారోత్సవము" కార్యక్రమములో భాగంగా వార్డు సభలను నిర్వహించాల్సి ఉండగా దానిలో భాగంగా మొదటి వార్డుసభ సమావేశము 3వ వార్డు శాలిబండ నందు చైర్ పర్సన్ పున్న శైలజ, 3వ వార్డు కౌన్సిలర్ అంకూరి సుమలత 3వ వార్డు వార్డు సూపర్వైజర్ శంకర్ గౌడ్ అద్వర్యంలో వార్డు సభ నిర్వహించడం జరిగింది. చైర్ పర్సన్ శైలజ మాట్లాడుతూ పర్యావరణ, పారిశుద్యం, పరిశుభ్రత, ఇంకుడు గుంతలు ఏర్పాటు గురించి ప్రసంగించారు. రాబోవు వర్షాకాలం సన్నద్ధతలో భాగంగా శిధిలావస్థలో ఉన్న ఇండ్ల తొలగింపు రోడ్ల వెంట నీరు నిల్వ ఉండకుండా, కంపచెట్ల తొలగింపు, మురికి కాలువలు పూడిక తొలగింపు గురించి, రాబోవు వర్షాకాలంలో వర్షస్థాయి తక్కువగా నమోదు అవుతుంది అని పర్యావరణ శాస్త్రవేత్తలు తెలియజేయడం వలన ప్రజలు నీటినీ పొదుపుగా వినియోగించుకోవాలని పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ రామ దుర్గా రెడ్డి మాట్లాడుతూ.. వార్డులో ఈ మధ్య చేపట్టిన కంపచెట్ల తొలగింపు, విధిదీపాల ఏర్పాటు గురించి తెలియజేసారు అలాగే కాలువల్లో చెత్త వేయకూడదు అని, ప్రజలు కూడా పరిశుభ్రత విషయంలో భాద్యతగా ఉండాలని, భూగర్భ జలాలను పెంచేందుకు ఇంకుడు గుంతలు ప్రతి ఇంట్లో ఏర్పాటు చేసుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారులు, మహిళా సంఘాల సభ్యులు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## పరకాలను ఎడ్యుకేషన్ హబ్ గా మారుస్తా

- ✦ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- ✦ పరకాల ప్రాంత యువతకు నైపుణ్య అభివృద్ధి ని పెంచేందుకు ఏటీసీ
- ✦ పరకాల పట్టణానికి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి



జయభేరి, పరకాల, జూన్ 04:

పరకాల పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటుకు సంబంధించి భూమిని అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పరకాల ప్రాంత యువతకు నైపుణ్య అభివృద్ధి అవకాశాలను పెంచేందుకు అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ కీలకంగా మారుతుందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ అందించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. వ్యవసాయం, విద్య, ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశలో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణం ద్వారా పరకాల పట్టణ అభివృద్ధికి తోడ్పాటు అందుతుందని అన్నారు. అలాగే పరకాల పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతున్నామని, అందులో భాగంగానే రాజుపేట సమీపంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి, ఏటీసీ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరకాల పట్టణ అభివృద్ధికి, యువతకు నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా ఏటీసీ ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు.

# త్వరలో ఇండియాకు వస్తా...

జయభేరి, హైదరాబాద్, జూన్ 4 :

పరారీలో ఉన్న లలిత్ మోడీ, భారత్‌కు తిరిగి రావడం, చట్టపరమైన విషయాల గురించి క్లియర్ గా మాట్లాడారురు. "నేను పారిపోవడం లేదు. ఈ రోజు నా స్నేహితులలో చాలా మంది అధికారంలో ఉన్నారని చెప్పాను, కానీ నేను సహాయం కోసం ఎవరికీ ఎప్పుడూ ఫోన్ చేయలేదు" అని అన్నారు. నేను మోదీ చాలా క్లోజ్‌గా ఉండే వాళ్లమని ఎప్పుడూ క్రికెట్ గురించి మాత్రమే మాట్లాడుకునే వాళ్లమని వివరించారు. ఐపీఎల్ మాజీ ఛైర్మన్, పరారీలో ఉన్న లలిత్ మోడీ, భారతదేశానికి తిరిగి రావడం, చట్టపరమైన విషయాలతో సహా పలు అంశాలపై ఇంటర్వ్యూలో మాట్లాడారు. తనపై బలమైన కేసు ఉంటే, తాను కోర్టుకు వెళ్లేవాడినని పేర్కొన్నారు. లలిత్ మోడీ భారత న్యాయ ప్రక్రియను కూడా ప్రశ్నించారు. "నేను ఏ చట్టం నుంచీ పారిపోవడం లేదు. నాపై పక్కా కేసు ఉండి ఉంటే, అది 17 ఏళ్లలోపే కోర్టుకు చేరి ఉండేది." ఇప్పటి వరకు తనపై ఎలాంటి క్రిమినల్ శిక్ష పడలేదని ఆయన పేర్కొన్నారు. "నేను ఏదైనా తప్పు చేసి ఉంటే, చర్య తీసుకుని ఉండేవారు."పరారీలో ఉన్న లలిత్ మోడీ తన సమస్య భారత ప్రభుత్వంతో కాదని, న్యాయ ప్రక్రియలోని నెమ్మదితోనే ఉందని పేర్కొన్నారు. చాలా కేసుల్లో నిజం బయటపడటానికి సంవత్సరాలు పడుతుందని ఆయన అన్నాడు. నెమ్మదైన న్యాయ ప్రక్రియే ఒక శిక్షగా మారుతుందని అన్నారు. ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోడీ ఐపీఎల్ గురించి మాట్లాడుతూ, "వ్యవస్థ అంగీకరించినా, అంగీకరించకపోయినా, నేను ఈ ఆటను, లీగ్‌ను చాలా నిశితంగా చూస్తున్నాను."



### 'నేను స్టేడియంను విమర్శించలేదు'

తాను స్టేడియంను విమర్శించలేదని, భారత క్రీడా మౌలిక సదుపాయాల కోసం ఒక పెద్ద దార్శనికత గురించి మాట్లాడుతున్నానని లలిత్ మోడీ అన్నారు. "ఈ రోజు ఇది భారత్‌లోనే అత్యుత్తమ స్టేడియం, కానీ అది సరిపోదు. నేను దానిని కూల్చివేస్తానని చెప్పాను. నేను దానిని కూల్చివేయడం గురించి మాట్లాడితే, ఇతర స్టేడియంలను కూడా కూల్చివేయాల్సి వస్తుంది. ఈ రోజు ఇది భారత్‌లోనే అత్యుత్తమ స్టేడియం అని నేను స్పష్టంగా చెప్పాను. కానీ నేను అంతర్జాతీయ స్థాయి అభిమానుల అనుభవాన్ని అందించాలనుకుంటే, నేను దానిని కూడా పునర్నిర్మిస్తాను." అని పేర్కొన్నారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి నేడు ఉన్న ఆర్థిక శక్తి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మక క్రీడా మైదానాలకు దీటుగా దేశంలో స్టేడియాలను నిర్మించాలని లలిత్ అన్నారు. "ఈ రోజు వెంబ్లీ స్టేడియం, లార్డ్స్, బార్సిలోనా క్యాంప్ నౌ, మాంచెస్టర్ యునైటెడ్ ఓల్డ్ ట్రాఫోర్డ్, మాంచెస్టర్ సిటీ ఎతిహాద్ స్టేడియంలను చూడండి. అవన్నీ మన స్టేడియాల కంటే ఎంతో ఉత్తమమైనవి. ఈ రోజు బీసీసీఐ వద్ద గతంలో కంటే ఎక్కువ డబ్బు ఉంది, కాబట్టి మనం మరింత పెద్ద స్థాయిలో ఆలోచించాలి." అని సూచించారు.

"ఈ రోజు నా ప్రాధాన్యత నా కుటుంబం, నా పిల్లలే. నా వల్ల, వారు ఊహించలేని పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఐపీఎల్ కూడా నాకు బిడ్డతో సమానం" అని అన్నారు. అధికార పార్టీతో తనకున్న సాన్నిహిత్యం గురించి లలిత్ మోదీ మాట్లాడుతూ, "ఈ రోజు నా స్నేహితుల్లో చాలా మంది అధికారంలో ఉన్నారు, కానీ నేను సహాయం కోసం ఎవరికీ ఫోన్ చేయలేదు. 17 ఏళ్లలో, నా స్వలాభం కోసం నేను ఏ రాజకీయ సంబంధాలను ఉపయోగించుకోలేదు." అని అన్నారు. "నేను కోరుకుంటే చాలా మందికి ఫోన్ చేసి ఉండొచ్చు, కానీ నేను ఎవరినీ సహాయం అడగలేదు." అని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని గొప్ప క్రికెట్ అభిమానిగా మాజీ ఐపీఎల్ ఛైర్మన్,క్రికెట్ నిర్వాహకుడు లలిత్ మోడీ అభివర్ణించారు. తనకు, ప్రధాని మోదీకి మధ్య జరిగే చర్చల్లో ఎక్కువ భాగం అహ్మదాబాద్‌లో క్రికెట్ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఉండేవని అన్నారు. గుజరాత్‌లో క్రికెట్ అభివృద్ధిపై ప్రధాని మోదీ ఎల్లప్పుడూ ఉత్సాహంగా ఉండేవారని చెప్పారు."మా సంభాషణలు కేవలం క్రికెట్ గురించే ఉండేవి," అని లలిత్ మోడీ అన్నారు, "నరేంద్ర మోదీ క్రికెట్ అభిమాని. ఆయనకు అహ్మదాబాద్‌లోని క్రికెట్ మౌలిక సదుపాయాలపై ఆసక్తి ఉండేది, మా చర్చలు క్రికెట్‌కే పరిమితమయ్యాయి." "నేను నరేంద్ర మోదీకి సన్నిహితంగా ఉండేవాడిని, కానీ ఆ సాన్నిహిత్యం క్రికెట్ విషయంలోనే కానీ రాజకీయాల విషయంలో కాదు." అని స్పష్టం చేశారు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం గురించి ఇటీవల చేసిన ప్రకటనల తర్వాత లలిత్ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. అవకాశం ఇస్తే, ప్రేక్షకులకు మెరుగైన వీక్షణా అనుభవాన్ని అందించడానికి ఆ స్టేడియంను కూల్చివేసి తిరిగి నిర్మిస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రముఖ క్రికెట్ స్టేడియంలలో ఒకటిగా పరిగణించే ఈ మైదానంపై ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి.

## మట్టి మాఫియాలో... ధాన్యం కొనుగోలులో విఫలమైన ప్రభుత్వం

జయభేరి, తుర్కపల్లి, జూన్ 04 :

మట్టి మాఫియాలో, ధాన్యం కొనుగోలులో పూర్తిగా ప్రభుత్వం విఫలమయిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ అన్నారు. గురువారం తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు గోర్ల రామచంద్రన్ తల్లి ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం మండల కేంద్రంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా జరుగుతున్న అక్రమ మట్టి తరలింపు కాంగ్రెస్ ప్రభుత్వం కన్నుసన్నలలోనే కొనసాగుతుందని తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార పార్టీ నాయకుల అండతో మట్టి మాఫియా ఇదేచ్ఛంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం కలిగిస్తుందని విమర్శించారు. అక్రమ మట్టి తవ్వకాల వల్ల వ్యవసాయ భూములు దెబ్బతింటున్నాయని గ్రామీణ రహదారులు నాశనం అవుతున్నాయని పర్యావరణ సమతుల్యం కు భంగం కలుగుతోందని అన్నారు. సంబంధిత అధికారులు అన్నీ తెలిసినా మౌనంగా ఉండడం వెనక రాజకీయ వర్ధిల్లు ఉన్నాయని అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు.



కొనుగోలు కేంద్రాలు రైతులు రోజుల తరబడి నిరీక్షిస్తున్న ప్రభుత్వం సందించడం లేదని వర్షాల కారణంగా ధాన్యం తడిసి రైతులు తీవ్ర నష్టాలు చెవి చూస్తున్నారని అన్నారు. రైతుల కష్టాలను అర్థం చేసుకోకుండా ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమని అన్నారు. మట్టి మాఫియా పై చచర్యల తీసుకోవడంలోనూ వడ్ల కొనుగోలు విషయంలోనూ ప్రభుత్వం ఇదే వైఖరి కొనసాగిస్తే భారతీయ జనతా పార్టీ ప్రజల తరపున పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే అక్రమతి తరలింపును ప్రత్యక్షంగా అడ్డుకొని రైతుల హక్కుల కోసం పోరాటం చేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్ ,రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యవర్గ సభ్యులు చాంద్ పాషా, సీనియర్ నాయకులు యాట పెంటయ్య ,కందుకూరి చిన్న చలమయ్య, ధ్యాన బోయిన సత్యానారాయణ ,జక్కుల వెంకటేశం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల రమేష్ ,జిల్లా గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి మాలోతు రమేష్ నాయక్, మోత్కుపల్లి బిక్షపతి, కానుగంటి భాను తదితరులు పాల్గొన్నారు.



## తెల్లవారుజామున డ్రైవర్లకు ఫేస్ వాష్ కార్యక్రమం నిర్వహిస్తున్న పోలీసులు

జయభేరి, పరవాడ:

అనకాపల్లి జిల్లా పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి16 పై నిత్యం భారీ సంఖ్యలో లారీలు, కంటైనర్లు, పరిశ్రమలకు సంబంధించిన వాహనాలు, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు మరియు ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పరవాడ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.ఈ క్రమంలో ప్రతిరోజూ తెల్లవారుజామున సమయంలో రాత్రంతా ప్రయాణించి అలసటకు గురైన లారీ, కంటైనర్, ట్రావెల్స్ బస్సులు మరియు ఇతర వాహనాల డ్రైవర్లను గుర్తించి వారికి ఫేస్ వాష్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. డ్రైవర్లను కొద్దిసేపు వాహనాలు నిలిపి ముఖం కడుక్కొని, నీరు తాగి, అవసరమైతే విశ్రాంతి తీసుకున్న తర్వాతే ప్రయాణం కొనసాగించేలా అవగాహన కల్పిస్తున్నారు.రాత్రి సమయంలో ఎక్కువ దూరం ప్రయాణించిన డ్రైవర్లు నిద్రమత్తుకు గురై క్షణకాలం రెప్ప మూసినా ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ముఖ్యంగా తెల్లవారుజామున 3 గంటల నుంచి 6 గంటల మధ్య నిద్రమత్తు ఎక్కువగా ఉండే అవకాశమున్నందున ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు తెలిపారు.డ్రైవర్లు అలసటగా అనిపించినప్పుడు వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో నిలిపి కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలని, నిద్రమత్తులో వాహనాలు నడపరాదని సూచించారు. అలాగే అధిక వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, సెల్‌ఫోన్ వినియోగం వంటి వాటిని పూర్తిగా నివారించాలని కోరారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ప్రాణరక్షణ కవచంగా పనిచేస్తుందని సీఐ తెలిపారు. హెల్మెట్ వినియోగం వల్ల ప్రమాదాల సమయంలో తలకు తీవ్ర గాయాలు కాకుండా ప్రాణాలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా పరవాడ పోలీసులు ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తారని సీఐ ఆర్. మల్లికార్జునరావు తెలిపారు.

## భూసార రక్షణ, పర్యావరణ పరిరక్షణతోనే స్థానిక ఆహార భద్రత



- ✦ గ్రామాల్లోని పంట వ్యర్థాలతోనే 30-40 మందికి ఉపాధి కల్పించవచ్చు
- ✦ వాతావరణ మార్పులకు భూమిని పచ్చగా ఉంచడమే ఏకైక విరుగుడు
- ✦ మర్రిచెట్టు తండా మాజీ సర్పంచ్ నేనావత్ శీను నాయక్ , ప్రముఖుల సమక్షంలో అవగాహన కార్యక్రమం

జయభేరి, దేవరకొండ :

ప్రస్తుత రోజుల్లో రైతాంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించి, స్థానిక ఆహార భద్రతతో పాటు దేశ ఆహార భద్రతను కాపాడాలంటే భూసార రక్షణ, పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమని ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ సాయి భాస్కర్ రెడ్డి అన్నారు. మర్రిచెట్టు తండా మాజీ సర్పంచ్, ప్రముఖుల సమక్షంలో జరిగిన ఒక ప్రత్యేక సమావేశంలో డాక్టర్ సదన్ ఐలయ్య స్థానిక నేతలతో కలిసి ఆయన మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం రసాయన ఎరువుల వాడకం వల్ల సాగు ఖర్చులు పెరిగి, వాతావరణ మార్పుల వల్ల రైతులు వ్యవసాయం చేయడం కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి ప్రసాదించిన ప్రతి గడ్డిపూసకు ఎంతో విలువ ఉందని, గ్రామంలో లభించే పంట వ్యర్థాలను (Agriculture Waste) సద్వినియోగం చేసుకోవడం ద్వారా అటు పర్యావరణాన్ని, ఇటు భూమాతను కాపాడుకోవచ్చని సూచించారు.

ఉపాధి కల్పన సుస్థిర వ్యవసాయం గ్రామాల్లో వృధాగా పోయే పంట వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తే కేవలం ఏడాది కాలంలోనే ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి, స్థానికంగా 30 నుండి 40 మందికి ఉపాధి, జీవనోపాధి కల్పించవచ్చు. వాతావరణ మార్పులకు విరుగుడు గ్లోబల్ వార్మింగ్, క్లైమేట్ చేంజ్ వంటి వాతావరణ మార్పులకు భూమిని పచ్చగా ఉంచడం, మట్టి నాణ్యతను పెంచడం ఒక్కటే సరైన విరుగుడు. భూమాతకు గౌరవం జీవకోటికి ఆధారం అయిన భూమాతను గౌరవించి, నేలను రసాయనాల బారిన పడకుండా కాపాడుకోవడం మనందరి బాధ్యత.

ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి భాస్కర్ రెడ్డితో పాటు డాక్టర్ సదన్ ఐలయ్య, మర్రిచెట్టు తండా మాజీ సర్పంచ్, స్థానిక రైతులు, పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

## నందిగామ బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

- ✦ ఇద్దరు యువకులు మృతి

జయభేరి, రంగారెడ్డి :

షాద్ నగర్ నియోజక వర్గం నందిగామ బైపాస్ రోడ్డులోని గాయత్రి మిల్క్ ప్లాంట్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. టాటా నెక్సాన్ కారు, హీరో స్ప్లెండర్ మోటార్ సైకిల్‌ను ఢీ కొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను రోషన్ కుమార్ (24), కొత్తూర్ పట్టణ నివాసి, బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా, అలాగే పంకజ్ (19), నందిగామ పట్టణంలో నివాసం ఉంటున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇద్దరూ నందిగామ పట్టణంలోని ఎస్ఎన్ పాలీ ప్యాక్ కంపెనీలో కార్మికులుగా పనిచేస్తున్నట్లు సమాచారం. ప్రమాదం అనంతరం కారు డ్రైవర్ ఘటన స్థలం నుంచి పరారైనట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సీహెచ్‌సీ షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు..

# ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలి

✦ సచివాలయంలో మీడియా సమావేశంలో కే.కేశవరావు, ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్




**జయభేరి, హైదరాబాద్ :**


తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి ప్రభుత్వం కమిటీ వేసింది.. దాని కోసం ఆల్ పార్టీ మీటింగ్ పెట్టడం జరిగింది.. ఉద్యమకారులు గుర్తించడానికి గుర్తించిన పార్టీలతో, ఉద్యమం సంబధం ఉన్న పార్టీలతో సమావేశం ఏరియా చేయడం జరిగింది..వారు ఏం కోరుకుంటున్నారు.. ఒపినియన్ ఏంటి అనేదానిపై సలహాలు సూచనలు స్వీకరించడం జరిగింది. విద్యార్థి సంఘాలను, అడ్వకేట్, డాక్టర్, ఉద్యమంతో సంబంధం ఉన్న వారిని కూడా పిలిచి మాట్లాడతాం.. ఇందులో మొదటిది ఉద్యమకారులను గుర్తించడం. తొలి తరం ఉద్యమకారులను గుర్తించడానికి చర్యలు తీసుకుంటాం.. ఉద్యమకారుల ఐడెంటిటీ పై వర్క్ డివైడ్ చేస్తాం.. సమావేశానికి హాజరైన ప్రతి పార్టీలు ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు.. ఇది రెండవ మీటింగ్ సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరి అభిప్రాయాలు తీసుకున్నాం.. తెలంగాణ కు మద్దతు ఇచ్చిన పార్టీలు అని ఐక్యంగా అందరివీ తీసుకున్నాం.. కమిటీ నివేదిక కు టైమ్ బాండ్ ఆలోచిస్తున్నాం.. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ఏర్పాటు చేసిన కమిటీ అఖిలపక్ష పార్టీలను ఇద్దరి చొప్పున పిలవడం జరిగింది. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్, జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతాం.. గాయాలు వివిధ విభాగాలుగా నష్టం జరిగిన వారికి న్యాయం చేస్తాం.. కవులు, కళాకారులు తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తించి.. దీని కార్యాలయం అమరవీరుల ద్వీపంలో ప్రారంభం అవుతుంది.. ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని గుర్తించాలని అందరి వద్ద సూచనలు స్వీకరించడం జరిగింది.. రాజకీయాలకు అతీతంగా సలహాలు సూచనలు స్వీకరిస్తాం.. ఆన్లైన్ ఆఫ్ లైన్ లో విజ్ఞప్తులు స్వీకరిస్తాం..
కోదండరాం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఉద్యమకారుల జెఏసీ లు ఉన్నాయి అందరిని కలుస్తాం.. అన్ని యూనివర్సిటీల జేఏసి లు ఉన్నాయి వారిని కలుస్తాం.. సమావేశం ఏర్పాటు చేస్తాం.. వారు మేము ఉద్యమంలో జీవితం యవ్వనం పోయిందని మమల్ని అందుకోవాలని కోరుతున్నారు..
అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు సబ్బండ వర్గాలతో సమావేశం అవుతాం.. 1969 ఉద్యమకారులను కూడా ఐడెంటిఫై చేయాలని చెప్పారు.. చనిపోయిన వాళ్ళు, గాయపడిన వారు, కేసులు అయి జైలుకు పోయిన వారిని గుర్తించి గౌరవించుకోవాలని ముఖ్యమంత్రి ఆలోచన.. మొదటి దశలో రాజకీయ పార్టీల నుండి తీసుకున్నాం.. అన్ని సంఘాల అభిప్రాయాలు తీసుకుంటాం..



## అమెరికాలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

**జయభేరి, అమెరికా :**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకొని గురువారం గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ యూటా చాప్టర్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ ఎన్ఆర్ఐలు ఒకేచోట చేరి వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా సత్య బాతుల హాజరుకాగా.. ప్రెసిడెంట్ విశాల్ రెడ్డి పట్లోళ్ల, వైస్ ప్రెసిడెంట్లు విష్ణు మొగుళ్ల, శ్రవ్య వెలిదె (కల్చరల్), కార్తీక్ జీవీఏ, కమ్యూనిటీ ప్రతినిధి సాయిరామ్ కొంపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమవీరులను, అమరవీరులను స్మరించుకుంటూ నివాళులర్పించారు. మౌలిక సదుపాయాలు, సాంకేతికత, వ్యవసాయం, సాంస్కృతిక పునరుజ్జీవనం రంగాల్లో తెలంగాణ 12 ఏండ్లలో ఎంతో సాధించిందని గుర్తు చేసుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన కమ్యూనిటీ మీట్ అండ్ గ్రీట్, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకటుకున్నాయి.



## ఉప్పల్ ప్రాంత ప్రజలకు మరో శుభవార్త

✦ 7న ఉప్పల్‌కు రానున్న సీఎం రేవంత్ రెడ్డి సీఎం చేతుల మీదుగా MMC కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ

**జయభేరి, ఉప్పల్:**

ఉప్పల్ భగాయత్‌లోనే మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (MMC) నూతన భవనాన్ని నిర్మించనున్నారు. దీనికి ప్రధాన కారణం - నిరంతరం ప్రజల బాగు కోరుతూ, నిత్యం ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్న ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి అవిరళ కృషి. వారి పట్టుదల ఫలితంగానే ఉప్పల్ భగాయత్‌లో MMC భవన నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎట్టకేలకు MMC భవన నిర్మాణానికి భూమి పూజ ముహూర్తం ఖరారైంది. ఈ నెల 7న గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం జరగనుంది. ఉప్పల్ భగాయత్‌లో 9 ఎకరాల విస్తీర్ణంలో రూ.99 కోట్ల నిధులతో ఆధునిక హంగులతో మూసీ నది ఒడ్డున అతి సుందరంగా MMC కార్యాలయాన్ని నిర్మించనున్నారు. దీంతో మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు పాలన మరింత చేరువ కానుంది. "ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. ఉప్పల్ భగాయత్‌లో MMC భవనం రావడం మన అందరి విజయం. ఉప్పల్‌ను అభివృద్ధిలో నెంబర్ 1 గా నిలబెడతాం" అని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోండి

✦ ఉద్యమకారుల కమిటీకి సిపిఐ సూచనలు





**జయభేరి, హైదరాబాద్ :**

గురువారం రాష్ట్ర సెక్రటేరియట్ లో తెలంగాణ ఉద్యమకారుల కమిటీ ఆధ్వర్యంలో, జరిగిన అఖిలపక్ష సమావేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తరపును రాష్ట్ర సహాయ కార్యదర్శులు, తక్కలపల్లి శ్రీనివాసరావు, ఈ టి నరసింహ పాల్గొన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన సీపీఐ, ఉద్యమకారుల ఆకాంక్షలు మరియు వారి కుటుంబాల రక్షణ కోసం ఈ క్రింది ప్రధాన ప్రతిపాదనలను కమిటీ దృష్టికి తీసుకెళ్లింది. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాలకు ఇళ్లు, ప్రభుత్వ ఉద్యోగం, మరియు ఆర్థిక సాయం అందేలా చూడాలి. ఇప్పటివరకు సాయం అందని మిగిలిన కుటుంబాలను వెంటనే ఆదుకోవాలి.ఉద్యమ సమయంలో విద్యార్థులు, యువకులు, మరియు ఉద్యమకారులపై నమోదైన అన్ని రకాల పోలీస్ కేసులను ఎలాంటి షరతులు లేకుండా పూర్తిగా ఎత్తివేయాలి.వయసు పైబడిన, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఉద్యమకారులకు నెలవారీ గౌరవ వేతనం అందించాలి. అలాగే వారి కుటుంబ సభ్యులందరికీ ఉచిత కార్పొరేట్ వైద్య సదుపాయం ఆరోగ్య కార్డులు, కల్పించాలి. కమ్యూనిస్టులు మరియు ఇతర సామాజిక శక్తులు చేసిన సాయుధ పోరాటాలు, మలిదశ ఉద్యమ చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలి. గన్‌పార్క్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో అమరవీరుల జ్ఞాపకార్థం స్మారక చిహ్నాలను నిర్మించాలి. తెలంగాణ సిద్ధించి ఒకటిన్నర దశాబ్దం కావస్తున్నా.. నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు సామాజిక సమానత్వం అనే ఉద్యమ ఆకాంక్షలు ఇంకా పూర్తిగా నెరవేరలేదు. ఉద్యమకారులను గౌరవించుకోవడం అంటే ఆ ఆకాంక్షల సాధన కోసం పనిచేయడమే."ఉద్యమకారుల కమిటీ కేవలం నామమాత్రంగా కాకుండా, క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల నుంచి వినతులు స్వీకరించి ప్రభుత్వానికి త్వరితగతిన నివేదిక సమర్పించాలని సీపీఐ డిమాండ్ చేస్తోంది.

## నాచారం డివిజన్ డ్రైనేజీ సమస్యలు పరిష్కరించండి

✦ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి



**జయభేరి, ఉప్పల్ :**

నాచారం డివిజన్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయాల్సిందిగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ జలమండలి ED పంకజని కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఇప్పటికే నాచారం డివిజన్లోని చాలావరకు డ్రైనేజీ సమస్యలను పరిష్కరించామని మిగిలిన కొన్ని పనులకు నిధులు మంజూరు చేసినట్లయితే డివిజన్లో డ్రైనేజీ సమస్యలు పూర్తిగా తీరుతాయని తెలియజేశారు. అలాగే కొన్ని మంజూరైన రోడ్లు డ్రైనేజీ ఏర్పాటు కాకపోవడం వల్ల ఆగిపోయాయని ED దృష్టికి తీసుకొని రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో బారాస రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కాప్రా మున్సిపల్ కార్యాలయంలో డీసీ రవీందర్ సాగర్‌తో భేటీ

✦ పెన్షన్ల సమస్యలపై చర్చించిన బొంతు శ్రీదేవి యాదవ్



**జయభేరి, కాప్రా :**

కాప్రా మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్ సాగర్ ని బొంతు శ్రీదేవి యాదవ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక లబ్ధిదారుల పెన్షన్లకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. కొత్త పెన్షన్ల మంజూరు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్ల సకాలంలో పంపిణీపై డీసీ దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీసీ రవీందర్ సాగర్, పెన్షన్ల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
అర్హత ఉన్న లబ్ధిదారుల జాబితాను పరిశీలించి త్వరితగతిన న్యాయం చేస్తామని తెలిపారు. కాప్రా సర్కిల్‌లో పెన్షన్ పొందుతున్న వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ/చేనేత కార్మికులు, వికలాంగులు అందరూ తప్పనిసరిగా లైవ్ అథెంటికేషన్ / ఫేస్ రికగ్నైజేషన్ చేయించుకోవాలి. గడువు ఇంకా వారం రోజులు మాత్రమే మిగిలి ఉంది. గడువులోపు చేయించుకోకపోతే పెన్షన్ నిలిచిపోతుంది. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన ధ్యేయమని, ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి గడపకు చేరేలా కృషి చేస్తామని బొంతు శ్రీదేవి యాదవ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ సెక్షన్ అధికారులు జోమని, లావణ్య నాయకులు సాయి కిరణ్, సరఫరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు మెరుగైన వైద్యం లేదు



**జయభేరి, ఘట్కేసర్ :**

MMC ఘట్కేసర్ డివిజన్ పరిధిలో గల ప్రభుత్వ వైద్య శాలను సందర్శించిన ఘట్కేసర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముల్లి జంగయ్య యాదవ్. ఈ సందర్భంగా ముల్లి జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యశాల వైద్యులు అదేవిధంగా హాస్పిటల్ సిబ్బంది పేద ప్రజలకు మెరుగైన వైద్యం అదేవిధంగా మెరుగైన సౌకర్యాలు అందించడం లేదని ప్రజల ద్వారా విషయం తెలుసుకొని హాస్పిటల్ సూపరింటెండెంట్ లింగమూర్తితో సమావేశం ఏర్పాటు చేసి పేద ప్రజల కోసం ప్రభుత్వం వైద్యశాలకు అన్ని సౌకర్యం అందజేస్తున్న వైద్యులు ప్రజల పట్ల నిర్లక్ష్యం వహించడం సరికాదని, ప్రజలు బాగుంటేనే మనమంతా బాగుంటాం అని తెలుపుతూ వారికీ మనతో అందే ప్రతి వైద్యం మీరు చేయాలనీ మీతో కానీ యెడల గాంధీ హాస్పిటల్ కి రిఫర్ చేయాలనీ తెలిపారు. సిబ్బంది కూడా వారి సమయ సూచిక ను పాటిస్తూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారికీ సేవ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేష్, sc సెల్ అధ్యక్షులు శ్రీనివాస్, మొయినార్టీ సీనియర్ నాయకులు కాయుమ్, యూత్ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, నాయకులు సత్తి రెడ్డి, అభిలాష్ యాదవ్, సాయి యాదవ్, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి చేస్తామని కాలనీ వాసులకు హామీ



**జయభేరి, శేరిలింగంపల్లి :**

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 2 కాలనీ లోని రోడ్ నెంబర్ 43లో డ్రైనేజ్, సీసీ రోడ్డుకు సంబంధించిన పెండింగ్ వర్క్ ఉన్నాయని కాలనీ వాసులు డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా వెంకటేష్ గౌడ్ కాలనీ పర్యటించి సమస్యను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆల్విన్ కాలనీ ఫేస్ 2 కాలనీ లోని రోడ్డు నెంబర్ 43 లో పెండింగ్ లో ఉన్న డ్రైనేజ్ లైన్ నిర్మాణ పనులను శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ అరెకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లి, సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పూర్తి చేస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. డ్రైనేజ్ లైన్ నిర్మాణం పూర్తయ్యాక సీసీ రోడ్డు కూడా త్వరగా నిర్మించి కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, కృష్ణారావు, కట్టా శ్రీనివాస్, చైతన్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# భూగర్భ డ్రైనేజీ పనులను పూర్తి చేయాలి

✦ జలమండలి ED పంకజ్ ని కలిసిన మాజీ GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి



**జయభేరి, హయత్‌నగర్ :**

హైదరాబాద్, ఖైరతాబాద్‌లోని HMWS &SB (హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు) ప్రధాన కార్యాలయంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ED) ఎస్. పంకజ్ గారిని మాజీ GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి డివిజన్‌లో టెండర్లు పూర్తయిన, అంచనాలు సిద్ధమై పరిపాలనా అనుమతులు పొందినప్పటికీ పెండింగ్‌లో ఉన్న తాగునీటి పైపులైన్ మరియు భూగర్భ డ్రైనేజీ పనులను వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ.. మన్సూరాబాద్ డివిజన్, హయత్ నగర్లోని స్వాతి రెసిడెన్సీ,ఆదర్శ్ నగర్, KVN రెడ్డి నగర్ కాలనీ, ఎల్లారెడ్డి కాలనీ, పవనగిరి కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, ఎల్లారెడ్డి కాలనీ పేస్ 2, BMS కాలనీ,రాజరాజేశ్వరి కాలనీతో పాటు పలు కాలనీలకు శాంక్షన్ అయిన భూగర్భ డ్రైనేజీ ఇన్నర్ లైన్ పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికే టెండర్లు పూర్తయిన పనులను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని కోరారు. త్రాగునీటి నూతన పైప్లైన్ సాంక్షన్ అయినా పనులు బృందావన్ కాలనీ స్ట్రీట్ 4, వీరన్న గుట్ట,పవనగిరి కాలనీ, ఇతర కాలనీలో కాంట్రాక్టర్ను అలెర్ట్ చేసి వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. హయత్ నగర్ శ్రీరామ్ నగర్ కాలనీలో 25/05/3026 రోజున DGM సాయినాథ్ గారు,స్థానిక మేనేజర్ సందీప్ గారు ఇన్స్పెక్షన్ చేసి ఎస్టిమేషన్ వేసిన కొత్త భూగర్భ డ్రైనేజీ లైన్ల పనులను సాంక్షన్ చేయాలని దినదిన అభివృద్ధి చెందుతున్న హయత్ నగర్ ప్రాంత కాలనీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. బృందావన్ కాలనీలో సుమారు 20 సంవత్సరాల క్రితం వేసిన పాత భూగర్భ డ్రైనేజీ లైన్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. చిన్నపాటి వర్షం కురిసినా డ్రైనేజీ నీరు రోడ్లపైకి పొంగి పొర్లుతూ కాలనీలను చెరువులను తలపించే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ మురుగు నీరు రహదారులపై ప్రవహించడం వల్ల ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలు, అంటువ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. బృందావన్ కాలనీ, సౌజన్య కాలనీ, భాగ్యనగర్ కాలనీల సమస్యల పరిష్కారం కోసం సుమారు రూ.25 నుండి 30 లక్షల వ్యయంతో 8 నెలల క్రితమే శాంక్షన్ అయిన పనులను తక్షణమే ప్రారంభించేందుకు సంబంధిత కాంట్రాక్టర్‌ను అప్రమత్తం చేసి పనులు వేగవంతం చేయాలని కోరారు. ముందుగా వస్తున్న వర్షాకాలం దృశ్య డ్రైనేజ్ మ్యాన్‌హోల్స్ లో పేరుకుపోతున్న సెల్టును,వ్యర్థాలను ఇతరులను తొలగించే ప్రయత్నం చేస్తే వచ్చే వర్షాకాలానికి ప్రజలకు ఎలాంటి సమస్య ఉండదని ముందుగా ఈ చర్యను తొందరగా ప్రారంభించాలని వారికి సూచించారు. ఈ అంశాలపై సనుకూలంగా స్పందించి జల మండలి ED పంకజ్ సంబంధిత జనరల్ మేనేజర్ మహేందర్ (GM)కి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తూ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## మియాపూర్ న్యూ కాలనీ వద్ద ఆక్రమణల తొలగింపు

**జయభేరి, రంగారెడ్డి :**

మియాపూర్ న్యూ కాలనీ దగ్గర ఆక్రమణలను సీఎంసీ అధికారులు తొలగించారు. రోడ్డు పక్కనే ఉన్న పర్నిచర్ షాప్ లను,గుడిసేలను తోలగించారు. ఎటువంటి ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు మధ్య ఆక్రమణలను తోలగించారు. తమకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా షాపులను తోలగించడం ఏంటని పర్నిచర్ షాప్ నిర్వహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల మియాపూర్ లో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. శంకుస్థాపన కార్యక్రమాలు సభ కోసం రోడ్డు పక్కనే ఉన్న పర్నిచర్ షాప్స్ ను తోలగిస్తున్నట్లు సమాచారం ప్రభుత్వ స్థలంలో రోడ్డు ఆక్రమణలను గుర్తించి తోలగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



# ఇన్‌స్టా పోస్ట్‌లో 'అశ్లీల శబ్దాలు'

ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) విజయం సాధించిన సందర్భంగా బాలీవుడ్ నటి నుష్రత్ బరుచా తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఒక వీడియో నెట్టింట తీవ్ర వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఆ వీడియో బ్యాక్‌గ్రౌండ్‌లో వినబడిన కొన్ని శబ్దాలు అశ్లీలంగా ఉన్నాయంటూ నెటిజన్లు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించారు. అయితే ఈ వివాదంపై తాజాగా స్పందించిన నటి.. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ ద్వారా అసలు నిజమేంటో బయటపెట్టింది. తాను మే 31వ తేదీ రాత్రి తన స్నేహితురాలి ఇంట్లో ఆర్‌సీబీ మ్యాచ్ చూస్తున్నానని, ఆ సమయంలో అక్కడ ఉన్న ఒక చిన్న కుక్క పిల్ల ఏడుస్తూ అలా శబ్దాలు చేసిందని నుష్రత్ క్లారిటీ ఇచ్చారు. అదే సమయంలో, అదే శబ్దాలతో వేరే యాంగిల్ నుండి తన స్నేహితురాలు తీసిన మరో వీడియోను కూడా ఆమె సాక్ష్యంగా పంచుకున్నారు. నెటిజన్లు ఇలాగే తప్పుగా అర్థం చేసుకుంటారనే భయంతోనే తాను మొదట ఆ వీడియోను డిలీట్ చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె నెటిజన్లపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ.. చేతిలో మొబైల్ ఫోన్ ఉన్నంత మాత్రాన ఇతరులను వేధించే హక్కు ఎవరికీ రాదని మండిపడ్డారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఆలోచించి మాట్లాడాలని, విషయాలను బ్లైండ్‌గా నమ్మేసి ట్రోల్ చేయవద్దని హితవు పలికారు.



# కొత్త సినిమా సన్నాహాల్లో..

అగ్ర హీరో వెంకటేష్ ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో 'ఆదర్శకుటుంబం' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. దీని తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో కల్యాణ్‌రామ్‌తో కలిసి ఓ మల్టీ స్టారర్ చిత్రాన్ని చేయబోతున్నారు. తాజా సమాచారం ప్రకారం ఆయన మరో చిత్రానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది. 'విశ్వంభర' దర్శకుడు వశిష్టతో ఓ చిత్రానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. స్టోరీ లైన్ నచ్చడంతో వెంకటేష్ ఈ సినిమాకు సూత్రప్రాయంగా అంగీకరించారని, ఫుల్ నరేషన్ అయిన తర్వాత సినిమాపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

# దసరా బరిలో కింగ్ 100?



అగ్ర నటుడు నాగార్జున ప్రస్తుతం తన వందో చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. రా.కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు 'కింగ్ 100' 'లాటరీ కింగ్' అనే టైటిల్స్ ప్రచారంలో ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నట్లు తెలిసింది. ఈ నెలాఖరులోగా షూటింగ్‌ను కంప్లీట్ చేసి పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను మొదలుపెడతారని సమాచారం. ఓ సామాన్యుడు అసాధారణ శక్తిగా ఎదిగిన వైనాన్ని ఆవిష్కరించే కథాంశమిదని, ఇందులో నాగార్జున విభిన్న కాలాల్లో, డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తారని అంటున్నారు. ఏఐ సాంకేతికతతో నాగార్జున రెట్రో లుక్స్‌ని రీక్రియేట్ చేయబోతున్నారని తెలిసింది. ఆయన లుక్స్‌తో పాటు క్యారెక్టర్ ప్రజెంటేషన్ సరికొత్తగా ఉంటుందని చెబుతున్నారు. ఈ చిత్రాన్ని దసరా బరిలో దించేందుకు నాగార్జున సన్నాహాలు చేస్తున్నారట. టబు కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని నాగార్జున స్వీయ నిర్మాణంలో తెరకెక్కిస్తున్నారు.

# రెండేళ్లుగా చరణ్ పడ్డ కష్టం చూశాను..



పాన్ ఇండియా స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ చిత్రం పెద్ది. కొన్నాళ్లుగా భారీ అంచనాల మధ్య తెరకెక్కించిన ఈ సినిమా ఎట్టకేలకు ఆడియన్స్ ముందుకు వచ్చింది. జూన్ 4న ఈ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయగా.. ఉదయం నుంచి బ్లాక్ బస్టర్ హిట్ రెస్పాన్స్ వస్తుంది. ఇందులో జాన్వీ కపూర్, జగపతి బాబు, శివరాజ్ కుమార్, జగపతి బాబు దివ్యేందు శర్మ కీలకపాత్రలు పోషించారు. ఈ సినిమాలో చరణ్ యాక్టింగ్, మేకోవర్, అలాగే డైరెక్టర్ బుచ్చిబాబు పవర్ ఫుల్ డైరెక్షన్ చూసి ఆడియన్స్ ఫిదా అవుతున్నారు. సినిమా అదిరిపోయిందని.. ముఖ్యంగా చరణ్ ఇరగదీశాడంటూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ సినిమాపై ఇదివరకే టాలీవుడ్ సినీ ప్రముఖులు సైతం ట్వీట్ చేశారు. తాజాగా మెగాస్టార్ చిరంజీవి సైతం పెద్ది చిత్రంపై ఆసక్తికర ట్వీట్ చేశఆరు. గత రెండెళ్లుగా చరణ్ పడ్డ కష్టం తాను దగ్గరుండి చూశానని.. ఒక నటుడిగా కూడా ఎంతో గర్వంగా అనిపిస్తుందంటూ ట్వీట్ చేశారు.

"నేను షూటింగ్ నిమిత్తం పొల్లాచిలో ఉన్నా కూడా నా మనసంతా "పెద్ది" దగ్గరే ఉంది. గత రెండేళ్లగా ఈ సినిమా కోసం చరణ్ పడ్డ కష్టం, చూపించిన శ్రద్ధాశక్తులు అన్నీ దగ్గర నుంచి చూశాను. ఈ రోజు ప్రేక్షకుల ప్రేమ, ప్రశంసలు చూస్తుంటే ఒక తండ్రిగా మాత్రమే కాదు, ఒక నటుడిగా కూడా ఎంతో గర్వంగా అనిపిస్తోంది. "పెద్ది" పాత్రలో పూర్తిగా లీనం కావడానికి తను అహర్నిశలు చేసిన కృషి, పట్టుదల, నిజాయితీ ప్రతి సన్నివేశంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ కష్టానికి దక్కిన ప్రతిఫలమే ఈ విజయం. ఇలాంటి అద్భుతమైన కథను రాసి, అంతే అద్భుతంగా తెరపై ఆవిష్కరించిన దర్శకుడు బుచ్చిబాబుకి నా ప్రత్యేక అభినందనలు. అలాగే తన తొలి చిత్రాన్నే ఇంత భారీ స్థాయిలో, ఎలాంటి రాజీ లేకుండా నిర్మించిన నిర్మాత వెంకటస్ కిలారుకి నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నటించిన నా మిత్రుడు, "కరునాడ చక్రవర్తి" శ్రీ నిమ్మ శివన్న గారికి, అప్పలసూరి పాత్రలో అద్భుతంగా జీవించిన నా సోదర సమానుడు జగ్గుభాయ్ కి అభినందనలు. అద్భుతమైన పాటలు, హృదయాన్ని కదిలించిన నేపథ్య సంగీతాన్ని అందించిన ఏఆర్ రెహమాన్ కి, తన ఛాయాగ్రహణంతో ప్రతి ఫ్రేమ్‌ను అత్యద్భుతంగా మలిచిన @RathnaveluDopకి, అమోఘమైన ఆర్ట్ వర్క్ అందించిన @artkolla కి, తన నైపుణ్యంతో మరో స్థాయికి తీసుకెళ్లిన ఎడిటర్ @NavinNooli కి నా ప్రత్యేక అభినందనలు. ఈ చిత్రం విజయంలో భాగమైన #JanhviKapoor, @divyenndu, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు, అలాగే @vriddhicinemas, @MythriOfficial, @SukumarWritings సంస్థలకు నా హృదయపూర్వక అభినందనలు. "పెద్ది" సాధించిన ఈ ఘన విజయం తెలుగు సినిమా కి గర్వంగా నిలవాలని, మరెన్నో మైలురాళ్లు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అంటూ ట్వీట్ చేశారు.



# అదే పెద్ద చాలెంజ్!

ప్రస్తుతం పూజా హెగ్డే దక్షిణాది చిత్రసీమపైనే పూర్తిగా దృష్టిపెట్టింది. ముఖ్యంగా తెలుగులో పూర్వ వైభవం కోసం గట్టి ప్రయత్నాలే చేస్తున్నది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఇండస్ట్రీ పరిస్థితులపై ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. ప్రస్తుతం థియేట్రికల్ సినిమా చాలా ఇబ్బందుల్లో ఉందని, విడుదలైన వెంటనే కంటెంట్ ఎలాంటిదో ప్రేక్షకులు ఓ నిర్ణయానికి వస్తున్నారని, ఫేక్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో వారిని మభ్యపెట్టడం సాధ్యం కాదని చెప్పింది. నేడు వినోదానికి అనేక వేదికలు అందుబాటులో ఉన్నాయని, ప్రేక్షకులు థియేటర్‌కు రావాలంటే కథలో బలమైన ఉద్వేగాలు ఉండాలని అభిప్రాయపడింది. కమర్షియల్ సినిమాల్లో నటించడం చాలా సులభమని అనుకుంటారని, కానీ వాటిలోనే ఎన్నో సవాళ్లుంటాయని పూజా హెగ్డే చెప్పింది. 'మంచి కథలో అభినయంపై దృష్టిపెడితే సరిపోతుంది. కానీ కమర్షియల్ సినిమా అలా కాదు. గ్లామర్‌తో పాటు డ్యాన్స్, ఎమోషన్స్.. ఇలా అన్ని అంశాల్లో సమతుల్యం పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలి. అన్నింటికంటే కమర్షియల్ సినిమానే పెద్ద చాలెంజ్' అని పూజా హెగ్డే చెప్పింది. ప్రస్తుతం ఈ భామ తెలుగులో దుల్కర్ సల్మాన్ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. శర్వానంద్ 'జార్జ్‌క్రిష్' చిత్రంలో కూడా ఆమెనే నాయికగా ఖరారయ్యే అవకాశాలున్నట్లు సమాచారం.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**